

కంటికి రెప్పలా చూసుకోండి

వేములవాడ రాజన్న కోడెలను కంటికి రెప్పగా చూసుకోవాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సూచించారు. బుధవారం రాజన్న కోడెలను రైతులకు పంపిణీ చేశారు. 8లో▸



ఆరుగురు ఖైదీల విడుదల

జిల్లా జైలు నుంచి ఆరుగురు ఖైదీలు విడుదల అయ్యారు. చర్లపల్లి జైలుకు తరలించి అక్కడి నుంచి విడుదల చేశారు. ముగ్గురికి జైళ్లశాఖ అధికారులు ఉపాధి చూపారు. 8లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 31.0/26.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్నిచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది. పగటి ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

వైద్యులు అప్రమత్తంగా ఉండాలి



జిల్లా వైద్యాధికారికి పుష్పగుచ్ఛం అందిస్తున్న వైద్యాధికారి, సిబ్బంది

కథలాపూర్: వర్షాకాలంలో వైద్యులు అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో ఎండీ.సవియొద్దీన్ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి అధికారులకు సూచనలు ఇచ్చారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. ముందుగా వైద్యసిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. వైద్యాధికారి సింధూజ, సూపర్‌వైజర్ భూషణ్, ల్యాబ్ టెక్నీషియన్ చిన్నరాజం, ఫార్మసిస్ట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాల బల్దియా కమిషనర్‌గా సమ్మయ్య



కె.సమ్మయ్య

జగిత్యాల: గిత్యాల మున్సిపల్ కమిషనర్‌గా కె.సమ్మయ్యను నియమిస్తూ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ పనిచేసిన అనిల్‌బాబు భూకబ్జా యత్నం కేసులో సెలవుపై వెళ్లారు. ఆయన తిరిగి రాకపోవడంతో ఫుల్ అడిషనల్ ఇన్‌చార్జి కమిషనర్‌గా రాయికల్ ఎంపీడీవో చిరంజీవిని నియమించారు. ప్రస్తుతం సెక్రటరియేట్‌లో పనిచేస్తున్న సమ్మయ్యను జగిత్యాల కమిషనర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. సమ్మయ్య మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

నేడు విద్యాసంస్థల బంద్



మాట్లాడుతున్న విద్యార్థి సంఘ నాయకులు

జగిత్యాల: 'నీట్' అవకతవకలను నిరసిస్తూ ఈనెల 4న దేశవ్యాప్తంగా కేజీ టు పీజీ ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల బంద్ చేపట్టనున్నట్లు ఎన్‌ఎస్‌యూఐ, ఏఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ, పీడీఎస్‌యూ నాయకులు తెలిపారు. నీట్‌లో అవకతవకలు జరిగినా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఎంతోమంది అభ్యర్థులతో చెలగాటం ఆడారన్నారు. బంద్‌కు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల యజమాన్యాలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు విజయ్, భార్గవ్, సుమిత, శివ, పవన్, అరుణ్, నితిన్, కొండ ప్రణయ్, నితీశ్, అక్రమ్ పాల్గొన్నారు.

ఉత్తమ అవార్డుకు దరఖాస్తులు ఆహ్వానం

జగిత్యాల: జాతీయస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు జిల్లాలోని అర్హత కలిగిన అన్ని కేటగిరీల ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డీఈవో జగన్మోహన్ రెడ్డి తెలిపారు. సెప్టెంబర్ 5న నిర్వహించే గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని ఎంఈవోలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ NATIONALAWARD TOTEACHER.EDUCATION.GOV.IN లో ఈనెల 15వరకు అన్ని వివరాలు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన ఒక సెట్‌ను డీఈవో కార్యాలయంలో అందించాలని పేర్కొన్నారు.

మండల ప్రత్యేకాధికారుల నియామకం

జగిత్యాలరూరల్: ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీల పదవీకాలం గురువారంతో ముగియనున్న నేపథ్యంలో మండల ప్రత్యేకాధికారులను నియమిస్తూ కలెక్టర్ సత్యప్రసాద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. బీర్‌పూర్ ప్రత్యేకాధికారిగా చిత్రు, బుగ్గారానికి ప్రకాశ్, ధర్మపురికి సీహెచ్.రాంచంద్రం, గొల్లపల్లికి ఎల్.సాయిబాబా, ఇబ్రహీంపట్నంకు ఎం.రఘువరణ్, జగిత్యాల రూరల్‌కు బి.నరేశ్, జగిత్యాలకు రాజ్‌కుమార్, కథలాపూర్‌కు వెంకటేశ్వర్‌రావు, కొడిమ్యాలకు జె.ప్రతాప్‌సింగ్, కోరుట్లకు ఆనంద్, మల్లాపూర్‌కు దేవరాజ్, మల్యాలకు వాణి, మేడిపల్లికి సురేందర్‌కుమార్, మెట్‌పల్లికి ఎం.సత్యనారాయణ, పెగడపల్లికి కె.వేణుగోపాల్, రాయికల్‌కు సంపత్‌రావు, సారంగాపూర్‌కు సుజాత, వెల్గటూర్‌కు జైసింగ్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రజల ఆరోగ్యంతో చెలగాటం

- జిల్లా కేంద్రంలోని బైపాస్‌రోడ్‌లో గల ఓ రెస్టారెంట్‌లో ఇటీవల ఫుడ్‌సేఫ్టీ అధికారులు తనిఖీ చేస్తే పురుగులు పట్టిన బియ్యం, పప్పులు, నువ్వులు, పల్లీలు, కాలం చెల్లిన వస్తువులు బయటపడ్డాయి. దీంతో ఆ హోటల్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేశారు.
- రెండు రోజుల క్రితం జిల్లా కేంద్రంలోని రెండు ప్రైవేటు స్కూల్ హాస్టళ్లలో తనిఖీ చేయగా ముక్కిన పప్పు, ముక్కిన బియ్యం, కాలం చెల్లిన వస్తువులు, పదార్థాలు బయటపడ్డాయి. వెంటనే వాటిని సీజ్ చేసి ల్యాబ్‌కు పంపించారు. జిల్లాలో ప్రైవేటు హాస్టళ్లలో విద్యార్థులకు ఇష్టానుసారంగా కల్తీ భోజనం పెడుతున్నా పట్టించుకునే అధికారులే లేరు.
- ఇటీవల కోరుట్ల, మెట్‌పల్లిలో పలు రెస్టారెంట్లలో మున్సిపల్ అధికారులు తనిఖీ చేయగా కుళ్లిన మాంసం, చికెన్, నిలువ చేసిన ఆహార పదార్థాలు బయటపడ్డాయి. ఇలా జిల్లాలో ఎవరైనా ఫిర్యాదు చేస్తేనే అధికారులు స్పందిస్తున్నారు. అధికారుల నియంత్రణ లేకపోవడం, మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు.



హాస్టళ్లలో ఇటీవల తనిఖీల్లో కనిపించిన ముక్కిపోయిన బియ్యం

- హాస్టళ్లు, రెస్టారెంట్లు, హోటళ్ల కల్తీమయం
- పట్టించుకోని ఆహార కల్తీ నియంత్రణ శాఖ అధికారులు
- ఫిర్యాదు చేస్తేనే తనిఖీలు

జగిత్యాల: జిల్లాలో పెద్దగా మున్సిపాలిటీలుగా జగిత్యాలతోపాటు, కోరుట్ల, మెట్‌పల్లి బల్దియాలు ఉన్నాయి. ఇక్కడ అనేకంగా హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు ఉన్నాయి. అయితే అధికారుల తనిఖీలు లేకపోవడంతో కుళ్లిన మాంసం, ఫ్రిజ్‌లో నిలువ ఉంచిన ఫిష్, మాంసం, కుళ్లిన ఆహార పదార్థాలను ప్రజలకు అంటగడుతున్నారు. ఆకర్షణీయమైన బోర్డులు పెడుతూ లోపల ఏసీలతోపాటు, అందంగా టేబుల్స్ ఏర్పాటు చేస్తున్నారేగానీ భోజనాల్లో మాత్రం నాణ్యత పాటించడం లేదు.

కుళ్లిన మాంసం.. కల్తీ నూనె

అనేక హోటళ్లలో కుళ్లిన మాంసం, కల్తీ నూనెలతో వండుతున్నారు. మనిషి అనారోగ్యానికి గురవుతున్నాడంటే ప్రధాన కారణం నూనెలే. హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల నిర్వాహకులు ధనార్జనే ధ్యేయంగా కల్తీనూనె, మసాలాలు వాడుతున్నారు. ఇటీవల ఫుడ్‌సేఫ్టీ అధికారులు, మున్సిపల్ అధికారులు కొందరి ఫిర్యాదు మేరకు తనిఖీలు చేస్తే ఈ హోటల్స్, రెస్టారెంట్లలో నిజాలు బయటపడ్డాయి. బిర్యానీ తయారీ కోసం వినియోగించే రంగులు, కల్తీనూనెలు కాలం చెల్లినవే లభించడం గమనార్హం. అధికారులు జరిమానా వేసి నోటీసులు ఇస్తున్నారే తప్ప కఠిన చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలున్నాయి.



ఇటీవల ఓ హాస్టల్‌లో వస్తువులను తనిఖీ చేస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్

ఫిర్యాదు చేస్తేనే దాడులు

హోటళ్లు, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లు, మెస్‌లలో ఆహారం కల్తీ జరుగుతుందని ఎవరైనా ఫిర్యాదు చేస్తేనే ఫుడ్‌సేఫ్టీ అధికారులు తనిఖీలు చేపడుతున్నారు. కల్తీ జరుగుతుందని తెలుస్తున్నప్పటికీ వారిపై చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. మున్సిపల్ శాఖ అధికారులు సైతం ఎక్కడ తనిఖీలు చేసిన పాపన పోలేదు.

ప్రైవేటు హాస్టళ్లలో సైతం...

జిల్లా కేంద్రంలో ప్రైవేటు, ప్రభుత్వ హాస్టళ్లలో ఇటీవల తనిఖీలు చేస్తే ముక్కిన పప్పు, కుళ్లిన మాంసం బయటపడ్డాయి. జిల్లాలో జరుగుతున్న ఆహార కల్తీపై కలెక్టర్ సత్యప్రసాద్ స్పందించి ప్రభుత్వ, ప్రైవేటు హాస్టళ్లలో వెంటనే తనిఖీలు చేయాలని ఆహార భద్రత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో రెండు రోజుల క్రితం వారు పలు ప్రైవేటు హాస్టళ్లు, ప్రభుత్వ హాస్టళ్లలో తనిఖీలు చేయగా దారుణాలు బయటపడ్డాయి. కొన్ని హాస్టళ్లలో పురుగులు పట్టిన బియ్యం, రవ్వ, మిల్‌మేకర్స్ అన్ని కుళ్లిపోయినవి కనిపించాయి. ప్రైవేటు హాస్టళ్లలో కిచెన్‌లు పరిశీలించినప్పుడు దుర్వాసన వెదజల్లిందంటే ఏ మేరకు అపరిశుభ్రంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. విద్యార్థుల నుంచి మాత్రం పకడ్బందీగా ఫీజులు వసూలు చేస్తున్నా.. ఏ ఒక్క ప్రైవేటు స్కూళ్ల హాస్టళ్లలో నిర్వహణ సరిగా లేదు.

ఫుడ్ లైసెన్స్‌లు అంతంతే..

మున్సిపాలిటీ అధికారులు ఇచ్చే ట్రేడ్ లైసెన్స్ ఉన్న వారికే ఆహార భద్రత శాఖ అధికారులు ఫుడ్ లైసెన్స్ జారీ చేస్తుంటారు. కానీ జిల్లాలో ఎక్కడా ఫుడ్ లైసెన్స్‌లు పెద్దగా తీసుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. కేంద్ర ప్రభుత్వం కొత్తగా ఫుడ్‌సేఫ్టీ స్టాండర్డ్ యాక్ట్ ప్రకారం కచ్చితంగా ఫుడ్ లైసెన్స్ తీసుకోవాలని ఆదేశాలున్నాయి. ముఖ్యంగా హోటల్, రెస్టారెంట్లు ఏర్పాటు చేసినప్పుడు గాలి, వెలుతురు, వాసన బయటకు వెళ్లేలా ఏర్పాట్లు చేయాలని, వంట చేసే వారు పరిశుభ్రంగా ఉండటంతో పాటు, తలవెంట్రుకలు పడకుండా కవర్స్ పెట్టుకోవాల్సిన అవసరం ఉంటుంది. కానీ ఈ నిబంధనలు ఎక్కడా పాటించడం లేదు. రసాయనాలు వాడకుండా వంట చేయాలని, మాంసం, ఇతర ఆహార పదార్థాలు నిలువ ఉంచకుండా రోజూ మార్చాలనే నిబంధనలున్నాయి. ఏ ఒక్క యజమాని ఇవి పాటించడం లేదు. ముఖ్యంగా హోటళ్లు, రెస్టారెంట్లు, దాబాలు పరిస్థితి దారుణంగా ఉంది.

జాగ్రత్తలు తీసుకోవాలి

జిల్లాలో హోటళ్లు, రెస్టారెంట్లు, దాబాలు నిర్వహించే వారు జాగ్రత్తలు తీసుకోవాలి. ఫుడ్‌లైసెన్స్‌లు తప్పకుండా ఉండాలి. నిత్యం తనిఖీలు చేపడతాం. నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తాం. హాస్టళ్లలో సైతం నిర్వాహకులు నాణ్యమైన భోజనం అందించేలా చూడాలి.

– అనూష, ఫుడ్ ఇన్‌స్పెక్టర్

తనిఖీలు చేపడతాం



రెస్టారెంట్లలో తనిఖీలు చేపడతాం. ప్రతిఒక్కరూ నిబంధనలు పాటించాలి. వంట గదులను పరిశుభ్రంగా ఉంచాలి. ఎవరైనా నిబంధనలు పాటించకపోతే ఆ హోటల్‌ను సీజ్ చేస్తాం. ప్రజలు కూడా వారి దృష్టికి వచ్చిన కల్తీపై సమాచారం అందించాలి.

– సమ్మయ్య, మున్సిపల్ కమిషనర్

ప్రజలకు పారదర్శకంగా సేవలందించాలి



మాట్లాడుతున్న జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వి.రాంచందర్

- ప్రభుత్వ పథకాలు క్షేత్రస్థాయిలో ప్రచారం చేయాలి
- అట్రాసిటీ కేసుల్లో పరిహారం సకాలంలో అందించాలి
- జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వి.రాంచందర్

జగిత్యాల: క్రమశిక్షణతో విధులు నిర్వర్తిస్తూ అధికారులు ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించాలని, అట్రాసిటీ కేసుల పరిహారం సకాలంలో అందించాలని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వి.రాంచందర్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్‌కుమార్, జాతీయ ఎస్సీ కమిషన్ సంచాలకులు సునిల్‌కుమార్, రీసెర్చ్ అధికారి వరప్రసాద్‌తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. శాఖలవారీగా పథకాల అమలు కట్టుదిట్టంగా నిర్వహించాలని, అర్హులను మాత్రమే ఎంపిక చేసి వారికి లబ్ధి చేకూరేలా చూడాలని, ప్రభుత్వ నియామకాల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ కట్టుదిట్టంగా పాటించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం అధికారులు రెవెన్యూ శాఖ, విద్యాశాఖ, పంచాయతీరాజ్, ఎస్సీ ఎంక్షేమ, గ్రామీణాభివృద్ధి శాఖ, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ వివరాలను రాంచందర్‌కు వివరించారు. వివిధ శాఖల వివరాలను కలెక్టర్ సత్యప్రసాద్, శాంతిభద్రతల అంశాలను ఎస్పీ అశోక్‌కుమార్ వివరించారు.



స్వాగతం పలుకుతున్న కలెక్టర్ సత్యప్రసాద్

అనంతరం రాంచందర్ మాట్లాడుతూ.. ఎస్సీలకు సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. ఎస్సీలకు కేటాయించిన అసైన్డ్‌ల్యాండ్ పట్టాలు అందించే అవకాశంపై రెవెన్యూ శాఖ అధికారులతో చర్చించి ఆదేశాలు జారీ చేశామన్నారు. విదేశీ విద్య పథకం, పాఠశాలల్లో ఎస్సీ విద్యార్థులకు అందుతున్న భోజనం, వసతి సౌకర్యాలు, బెస్ట్ అవైలేబుల్ స్కూల్స్‌లో వసతులు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అన్యాయం జరిగితే నిమ్నవర్గాల ప్రజలకు అండగా ఎస్సీ కమిషన్ ఉంటుందన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాజ్‌కుమార్, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి ఆర్డీవోలు మధుసూదన్, శ్రీనివాస్, ఆనంద్‌కుమార్, తహసీల్దార్లు పాల్గొన్నారు. ముందుగా రాంచందర్‌కు కలెక్టర్ సత్యప్రసాద్ స్వాగతం పలికారు. అలాగే ఎస్పీ అశోక్‌కుమార్ ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందించారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- కథలాపూర్, భీమారంలో పర్యటన



భీమారంలో బతుకమ్మలతో శ్రీనివాస్, వసంత

కథలాపూర్/మేడిపల్లి: ప్రజాసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. కథలాపూర్ మండలం అంబారిపేటలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో రూ.12 లక్షలతో నిర్మించిన ఎరువుల గోదాం, గంభీర్‌పూర్‌లో సీడీపీ, మండల పరిషత్ నిధులు రూ.11.80 లక్షలతో నిర్మించిన మహిళా సంఘం భవనాన్ని జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డితో కలిసి బుధవారం ప్రారంభించారు. కలిగోట సూరమ్మ రిజర్వాయర్ పనులు త్వరగా పూర్తి చేస్తామన్నారు. ఎంపీపీ జవ్వాజి రేవతి, జెడ్పీటీసీ నాగం భూమయ్య, సింగిల్‌విండో చైర్మన్ దాసరి గంగాధర్, వైస్ ఎంపీపీ కిరణ్‌రావు, వైస్ చైర్మన్ శీలం మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం భీమారం మండలంలోని రంగాపూర్‌లో పర్యటించారు. పాఠశాలలో వాటర్ ప్లాంట్, ఎస్సీ కమ్యూనిటీ హాల్, మహిళా సమైక్య భవనం, సీసీ కెమెరాలు ప్రారంభించారు. లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ చెక్కులు పంపిణీ చేశారు. పదవీకాలం పూర్తి చేసుకుంటున్న ఎంపీటీసీలు, ఎంపీపీ జెడ్పీటీసీలను సన్మానించారు. భీమారం మండలానికి జూనియర్ కాలేజీ మంజూరు విషయమై అధికారులతో మాట్లాడుతున్నానని పేర్కొన్నారు.

చదును చేసిన భూముల్లో మొక్కలు నాటుతాం



ఆత్మకూర్‌లో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఫారెస్ట్ అధికారులు

- మెట్‌పల్లి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ షౌకత్‌అలీ వెల్లడి
- గ్రామస్తులతో కలిసి చదును చేసిన అటవీ భూములు పరిశీలన

సాక్షి స్పందన

మెట్‌పల్లిరూరల్: అటవీ భూములు ఆక్రమణకు గురికాకుండా చర్యలు చేపడుతున్నామని మెట్‌పల్లి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ షౌకత్‌అలీ అన్నారు. ఇటీవల 'సాక్షి'లో ప్రచురితమైన 'అటవీ భూముల ఆక్రమణ' కథనానికి ఫారెస్ట్ అధికారులు స్పందించారు. మెట్‌పల్లి మండలం ఆత్మకూర్‌లో చదును చేసిన అటవీ భూములను బుధవారం గ్రామస్తులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా చదును చేసిన భూముల్లో ఈత, కానుగ మొక్కలు నాటుతామన్నారు. కొందరు కిందిస్థాయి సిబ్బంది అండతోనే అటవీ భూములను అడ్డగోలుగా చదును చేస్తున్నారని పలువురు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.గతంలో ఓ అధికారి ఇక్కడ పనిచేసిన సమయంలో ఒక్క చెట్టును నరికివేయాలంటేనే భయపడే వారని, అలాంటిది ఇప్పుడు అడ్డూఅదుపులేకుండా భూములు చదును చేస్తున్నారని తెలిపారు. అటవీ భూములు అక్రమణలకు గురికాకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ హఫీజొద్దీన్, బీట్ ఆఫీసర్, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీసీలకు సన్మానం

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీటీసీల ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ స్థానిక సంస్థలకు కొద్దిరోజులుగా బిల్లులు రాక పనిచేసిన ప్రజాప్రతినిధులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధుల విడుదలకు కృషి చేస్తానన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత మాట్లాడుతూ స్థానిక సంస్థల బలోపేతానికి నిధులు ఎంతో అవసరమన్నారు. అనంతరం ఎంపీటీసీలను ఘనంగా సన్మానించారు. ఎంపీపీ మంగళారపు మహేశ్, ఎంపీడీవో రమాదేవి, ఎంపీవో రవిబాబు, సూపరింటెండెంట్ గంగాధర్ పాల్గొన్నారు.



ఎంపీటీసీలతో ఎమ్మెల్సీ, జెడ్పీచైర్‌పర్సన్

అతీగతీలేని మాస్టర్ ప్లాన్

- రాయికల్ బల్దియాలో నిలిచిపోతున్న ఇళ్ల నిర్మాణం
- ఇబ్బందిపడుతున్న పట్టణవాసులు
- పెండింగ్‌లో కొత్త మాస్టర్ ప్లాన్ నివేదిక
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



రాయికల్ పట్టణం

రాయికల్ (జగిత్యాల): రాయికల్ మున్సిపాలిటీగా మారినప్పటి నుంచి మాస్టర్ ప్లాన్ అమలు ఎప్పుడవుతుందా అని పట్టణ ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఇళ్ల నిర్మాణానికి అనుమతి రాకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. రాయికల్ మేజర్ గ్రామ పంచాయతీ నుంచి 2018 సెప్టెంబర్‌లో మున్సిపాలిటీగా ఏర్పడింది. ఆ సమయంలో రూపొందించిన మాస్టర్ ప్లాన్‌పై ప్రజలకు అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమయ్యారు. దీంతో భూములు కొనుగోలు చేసిన వారు ప్రస్తుతం తీవ్ర ఇబ్బంది పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఏడాది క్రితం నూతన మాస్టర్‌ప్లాన్‌కు కౌన్సిల్ ఆమోదించినా ఉన్నతాధికారులు ఆమోదించకపోవడంతో గ్రీన్ బెల్ట్, ఇండస్ట్రీయల్, ఆరెంజ్ జోన్‌లో భూములు కొన్నవారు ఇళ్లు కట్టుకోలేకపోతున్నారు.

పది జోన్లుగా ఏర్పాటు

మున్సిపాలిటీగా ఏర్పడిన తర్వాత రాయికల్ పట్టణాన్ని పది జోన్లుగా విభజించారు. ఇందులో రెసిడెన్షియల్, కమర్షియల్, ఇండస్ట్రియల్, పబ్లిక్ అండ్ సెమీపబ్లిక్, ట్రాన్స్‌ప్రక్షన్ అండ్ కమ్యునికేషన్, వాటర్ సోర్స్, గ్రీన్ బెల్ట్, గ్రేవీయార్డ్, రోడ్స్, అర్బన్‌సెబుల్, అగ్రికల్చర్ జోన్లుగా గుర్తించారు. ట్రాన్స్‌ప్రక్షన్ అండ్ కమ్యునికేషన్ జోన్‌లో జగిత్యాల రోడ్ నుంచి పెట్రోల్‌బంక్ వరకు, ఎర్రకుంట, పోతిన్‌కుంట, న్యూబస్టాండ్ ఏరియా, పరిసర ప్రాంతలు, గ్రీన్ బెల్ట్‌లో జన్మయ చెరువు, అయ్యప్ప మందిరం, పోలీస్‌స్టేషన్, ఎంపీడీవో ఆఫీసు, పోలెన్‌కుంట, నాగులకుంట, అకిరేడుకుంట, రామాజీపేట రోడ్, ఎర్రకుంట, ఇండస్ట్రియల్ జోన్‌లో అపోసిట్ అయ్యప్పస్వామి టెంపుల్, పొలెన్‌కుంట పరిసర ప్రాంతాలు, గౌరిశంకర్ రైస్‌మిల్లు, సహరబాయి బీడీ కంపెనీ వంటి ప్రాంతాలను గుర్తించారు.

గ్రీన్‌బెల్ట్, ఇండస్ట్రీయల్ జోన్‌లో కొనుగోలుదారులకు ఇబ్బందులు

గ్రీన్ బెల్టు, ఇండస్ట్రీయల్ జోన్‌లో భూములు కొనుగోలు చేసిన వారు నిర్మాణాలు చేయలేకపోతున్నారు. గ్రీన్‌బెల్టులో కుంటలకు సంబంధించిన భూములు ఉండటంతో ఇక్కడ ఎలాంటి నిర్మాణాలూ చేపట్టరాదని, పర్మిషన్ ఇవ్వబోమని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. ఇండస్ట్రియల్ ఏరియాలో కేవలం పరిశ్రమలే నిర్మించాలని, ఇతర నిర్మాణాలు చేపట్టరాదని మాస్టర్ ప్లాన్‌లో రూపొందించారు. దీంతో లక్షలు వెచ్చించి భూములు కొన్నవారు నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి స్పందించి మాస్టర్ ప్లాన్ అమలు చేసేలా చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఇళ్లకు అనుమతించడం లేదు



గ్రీన్‌బెల్టు, ఇండస్ట్రీయల్ జోన్లలో ఇళ్ల నిర్మాణం చేపట్టాలంటే మున్సిపల్ అధికారులు అనుమతివ్వడం లేదు. ఇళ్లు కట్టుకోవాలన్నా, భూముల క్రయవిక్రయాలు జరగాలన్నా ఇబ్బంది పడుతున్నాం. చాలా మంది ఇళ్లు కట్టుకోలేక అద్దెకు ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.

– ఎలిగేటి రామకృష్ణ, రాయికల్

సీడీఎంఏ ఆఫీసులో ఫైల్



మున్సిపాలిటీలో గతంలో ఉన్న మాస్టర్ ప్లాన్‌లో ఉన్న జోన్ల ప్రక్రియతో ఇబ్బంది నిజమే. కౌన్సిలర్లంతా జోన్ల మార్పిడిపై తీర్మానం చేసి నూతన మాస్టర్‌ప్లాన్ అమలుపై సీడీఎంఏకు ఫైల్ పంపించారు. అనుమతి రాగానే అమలు చేస్తాం.

– జగదీశ్వర్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్

బీసీలకు రిజర్వేషన్ ప్రకటించాలి



మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

జగిత్యాల: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్ ప్రకటించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని దేవిశ్రీ గార్డెన్స్‌లో సమావేశం నిర్వహించారు. బీసీ కార్పొరేషన్ నుంచి బీసీలకు వారి అవసరాల నిమిత్తం వ్యాపార, వ్యవసాయ, విద్యకు తప్పనిసరిగా బ్యాంక్ లోన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సబ్సిడీలతో కూడిన రుణ సహాయం అందించాలని, కేజీ టు పీజీ ఉచిత విద్య అందించాలని డిమాండ్ చేశారు. ఇటీవల మరణించిన పీసీసీ మాజీ అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్‌కు సంతాపం తెలిపారు. గంగాధర్, ఈశ్వరయ్య, రాంచందర్, వెంకటేశ్, రవి, ఉదయ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

షార్జాలో కొత్తపేటవాసి బలవన్మరణం


శేఖర్ (ఫైల్)

రాయికల్(జగిత్యాల): మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన తునికి శేఖర్(27) షార్జాలో ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. తునికి నర్సయ్య–గంగరాజు దంపతులకు నలుగురు కుమారులున్నారు. మూడో కొడుకు శేఖర్ ఉపాధి నిమిత్తం నెల రోజుల క్రితం షార్జా వెళ్లాడు. అక్కడి బల్దియా కంపెనీలో పని చేస్తున్నాడు. జూన్ 22న రూంలో తన స్నేహితుడితో జరిగిన గొడవతో మనస్తాపానికి గురై, చెట్టుకు ఉరేసుకున్నాడు. అతని మృతదేహాన్ని త్వరగా స్వగ్రామానికి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బంధువులు, గ్రామస్తులు కోరుతున్నారు.

బాలికను కిడ్నాప్ చేసిన వ్యక్తి అరెస్టు

ముస్తాబాద్(సిరిసిల్ల): బాలికను కిడ్నాప్ చేసిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ముస్తాబాద్ మండలంలోని గూడూరుకు చెందిన బత్తిని ప్రశాంత్ అదే గ్రామానికి చెందిన బాలికను పెళ్లి చేసుకుంటానని నమ్మించి, కిడ్నాప్ చేశాడు. బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించామని ఎస్సై పేర్కొన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడేవారు ఎంతటివారైనా కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పోలీసుల అదుపులో గంజాయి విక్రేతలు?

ధర్మపురి: ఇద్దరు గంజాయి విక్రేతలను ధర్మపురి పోలీసులు పట్టుకున్నట్లు సమాచారం. ధర్మపురి పట్టణంలోని పెట్రోల్ బంకు వద్ద బుధవారం సాయంత్రం వాహనాలు తనిఖీ చేస్తుండగా బైక్‌పై వెళ్తున్న ఇద్దరు అనుమానాస్పదంగా కనిపించినట్లు తెలిసింది. వారిని తనిఖీ చేయగా గంజాయి లభ్యమైనట్లు సమాచారం.

ఆలయంలో చోరీ

వేములవాడరూరల్: మండలంలోని వట్టెంల పెద్దమ్మ తల్లి ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు గ్రామస్తులు బుధవారం తెలిపారు. వట్టెంల నుంచి నమిలిగుండుపల్లికి వెళ్లే రొంపి చెరువు వద్ద ఈ ఆలయం ఉందన్నారు. మంగళవారం రాత్రి ఆలయంలో చొరబడిన దుండగులు అమ్మవారి మెడలోని పుస్తెలతాడు, ముక్కు పుడక, ఇతర ఆభరణాలను ఎత్తుకెళ్లారని పేర్కొన్నారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

రాజన్నపేటలో ట్రాక్టర్..

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని వరదవెల్లి అనుబంధ గ్రామం రాజన్నపేటలో ఈడుగు కనకయ్యకు చెందిన ట్రాక్టర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారని ఎస్సై పృథ్వీధర్ బుధవారం తెలిపారు. కల్టివేటర్, నాగళ్లతో సహా ట్రాక్టర్‌ను ఎత్తుకెళ్లారని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఆకుపచ్చ రంగులో ఉన్న ట్రాక్టర్ ఎక్కడైనా కనిపిస్తే 87126 56418 ఫోన్ నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

జగిత్యాల డీఎస్బీ సీఐగా ఆరీఫ్ అలీఖాన్

జగిత్యాలక్రైం: మల్టీజోన్–1 పరిధిలో 10 మంది సర్కిల్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ మల్టీజోన్–2 జోన్ ఇన్‌చార్జి ఐజీ సుధీర్‌బాబు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. జగిత్యాల డీఎస్బీ సీఐగా పనిచేస్తున్న నాగేశ్వర్‌రావును ఐజీపీ కార్యాలయానికి బదిలీ చేయగా, ఐజీపీ కార్యాలయంలో పనిచేస్తున్న ఆరీఫ్ అలీఖాన్‌ను జగిత్యాల డీఎస్బీ సీఐగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

కోడెలను కంటికిరెప్పలా చూసుకోండి

- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
- ఎములాడ రాజన్న కోడెలు రైతులకు ఉచితంగా పంపిణీ


కోడెలకు పూజ చేస్తున్న విప్ శ్రీనివాస్, పక్కన కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

వేములవాడ అర్బన్: ఎములాడ రాజన్న కోడెలను ఆ రాజరాజేశ్వరస్వామివారి ప్రసాదంగా భావించి, కంటికిరెప్పలా చూసుకోవాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్ రాజన్న గోశాలలోని కోడెలను బుధవారం రాజన్నసిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝాతో కలిసి, బుధవారం రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. ఎములాడ రాజన్నకు కోడెమొక్కు చెల్లించుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఆ కోడెలను రాజన్న గోశాలలో సంరక్షిస్తున్నట్లు తెలిపారు. కానీ, గోశాల పరిమితి 400 జీవాలకే ఉందని, ప్రస్తుతం 1,500 పైగా ఉండటంతో ఇబ్బందులు వస్తున్నాయని పేర్కొన్నారు. అర్హులైన పేద రైతులకు, ఇతర గోశాలలకు వాటిని ఉచితంగా అందించాలని ప్రభుత్వ ఆదేశించినట్ల తెలిపారు. దీంతో కలెక్టర్ ఏర్పాటు చేసిన కమిటీ నిర్ణయం మేరకు రైతులకు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. గోశాలలోని కోడెల సంరక్షణకు, వసతుల కల్పనకు ప్రభుత్వం రూ.1.11 కోట్లు మంజూరు చేసిందన్నారు. ప్రతీ రైతుకు రెండు కోడెలను అందిస్తున్నట్లు తెలిపారు. గోశాలలో ఇకనుంచి 400 కోడెలను ఉంచుతామని, తర్వాత వచ్చేవాటిని ప్రతినెలా నిరంతరాయంగా పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో వినోద్ రెడ్డి, అధికారులు, మండల పశువైద్యాధికారి ప్రశాంత్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

గతంలో గోశాల ఫెడరేషన్ ఆధ్వర్యంలో..

2012 నుంచి 2024 జనవరి వరకు రాజన్న కోడెలను తెలంగాణ గోశాల ఫెడరేషన్ నుంచి లేఖ తెచ్చుకున్న వారికి ఉచితంగా అందించారు. 2 జనవరి 2024న వ్యాన్‌లో తరలిస్తున్న కోడెల వ్యాన్‌ను భజరంగ్‌దళ్ నాయకులు పట్టుకొని, పోలీసులకు అప్పగించగా, వారు సీజ్ చేశారు. ఫెడరేషన్ నుంచి పొందిన లేఖలో పేర్కొన్నట్లు సంబంధిత స్థలంలో గోశాల లేకపోవడమే ఇందుకు కారణం. అప్పటి నుంచి కోడెలను గోశాలలకు అందించడం నిలిపివేశారు. దీంతో గోశాలలో వాటి సంఖ్య పరిమితి దాటిపోయింది.

400 దరఖాస్తులు..

రాజన్న కోడెలను ఉచితంగా ఇస్తున్నారని తెలిసి, జిల్లా వ్యాప్తంగా రైతులు పెద్దఎత్తున తరలివచ్చారు. 400 వరకు దరఖాస్తులను ఆలయ అధికారులకు అందించారు. ఉదయమే గోశాలకు చేరుకున్న ఆలయ అధికారులు, పశువైద్యాధికారులు కోడెలకు ట్యాగ్‌లు వేశారు. కోడెలను ఏడాదిపాటు పోషిస్తే వ్యవసాయానికి ఉపయోగపడతాయని రైతులు సంతోషం వ్యక్తం చేశారు. అర్జీల సీరియల్ నంబర్ ప్రకారం అధికారులు వారికి కోడెలను అందించారు.

చాలా సంతోషంగా ఉంది



నాకు ఐదెకరాల వ్యవసాయ భూమి ఉంది. కోడెలను ఏడాది సాదుకుంటే వ్యవసాయానికి పనికి వస్తాయి. వాటిని తీసుకోవడం చాలా సంతోషంగా ఉంది.

– ఎదుల రామస్వామి, రైతు, వేములవాడ

రెండు కోడెలు ఇచ్చారు



రాజన్న కోడెలను కంటికిరెప్పలా చూసుకుంటాను. కోడెలను ఇస్తున్నారని తెలియడంతో వచ్చి, దరఖాస్తు చేసుకున్నాను. రెండు కోడెలు ఉచితంగా ఇచ్చారు.

– పిల్లి వెంకటేశం, రైతు, నూకలమర్రి

అదృష్టంగా భావిస్తున్నాను



స్వామివారి కోడెలు రావడం అదృష్టంగా భావిస్తున్నాను. వీటిని మంచిగా చూసుకుంట. రెండేళ్లు ఆగితే పెద్ద ఎడ్లుగా తయారవుతాయి. వ్యవసాయ పనులు చేస్తాయి.

– గుమ్మడి మొండయ్య, రైతు, కోనాయపల్లి


కోడెమొక్కు చెల్లించుకుంటున్న విప్ లక్ష్మణ్‌కుమార్


రాజన్న ఆలయ ఆవరణలో భక్తులు

రాజన్న సన్నిధికి పదివేల మంది

వేములవాడ: స్థానిక రాజరాజేశ్వరస్వామివారిని బుధవారం పదివేల మంది భక్తులు దర్శించుకున్నారు. ధర్మగుండంలోకి వచ్చిన స్వచ్ఛమైన గోదావరి జలాల్లో పుణ్యస్నానాలు చేసి, కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించారు. తడి బట్టలతోనే నిలువెత్తు బంగారం పంపిణీ చేశారు. రాజన్నకు అభిషేకాలు, అన్నపూజలు చేసి, కోడె మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, ఏఈవోలు శ్రీనివాస్, ప్రతాప నవీన్, జయకుమారి ఏర్పాట్లను పరిశీలించారు.

రెండుసార్లు బ్రేక్ దర్శనాలు

వేములవాడ రాజన్నను దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు రావడంతోపాటు వీఐపీల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. దీంతో రాష్ట్ర దేవాదాయశాఖ వీఐపీల కోసం రోజుకు రెండుసార్లు బ్రేక్ దర్శనాలు ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఈ మేరకు ఆలయ అధికారులు ప్రతీరోజు ఉదయం 10.15 గంటల నుంచి 11.15 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు బ్రేక్ దర్శనాలకు ప్లాన్ చేసి, రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్‌కు నివేదిక పంపించారు. బ్రేక్ దర్శనాలు చేసుకునేవారికి ఒక్కొక్కరికి రూ.300 టికెట్ పెట్టినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఇందులో పదేళ్లలోపు బాలబాలికలకు మినహాయింపునిస్తున్నట్లు సమాచారం.

రాజన్న సేవలో ప్రభుత్వ విప్ 'అడ్లూరి'

రాజన్నను ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన అవకాశం కల్పించారు. అనంతరం ఆయన కోడెమొక్కు చెల్లించుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి ప్రసాదాలు అందించి, సత్కరించారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

రుద్రంగి(వేములవాడ): రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని కరీంనగర్ జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ కె మదన్ మోహన్ రెడ్డి సూచించారు. బుధవారం ఆయన మండలవ్యవసాయ అధికారులతో కలిసి రుద్రంగిలో నారుమడి, పత్తి, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. కాండం తొలుచు పురుగు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మండల వ్యవసాయ విస్తరణ అధికారులు జ్యోతి, విజయ్, రైతులు పాల్గొన్నారు.


నారుమడిని పరిశీలిస్తున్న శాస్త్రవేత్త, అధికారులు

పాడైన కిడ్నీలు.. పనిచేయని చేయి

- రోజు విడిచి రోజు డయాలసిస్
- పింఛన్ వస్తలేదు.. ఏ పనీ చేయలేడు
- ప్రయాణం, మందుల ఖర్చులకు నెలకు రూ.6 వేలు ఖర్చు
- రాయికల్ యువకుడి ఇబ్బందులు
- ఆపన్నహస్తం కోసం ఎదురుచూపు


సాగర్

రాయికల్(జగిత్యాల): నిరుపేద కుటుంబం. తల్లి బీడీలు చేస్తేనే బుక్కెడు బువ్వ నోట్లోకి వెళ్లే దుస్థితి. ఒక్కగానొక్క కొడుకు రెండు కిడ్నీలు పాడైపోవడం, రోజు విడిచి రోజు డయాలసిస్ చేయించాల్సి ఉండటంతో ఆ తల్లి కంటతడి పెడుతోంది. ఎదిగిన కొడుకు తనను పోషిస్తాడనుకుంటే అతనికే సేవ చేయాల్సిన పరిస్థితి రావడంతో నిత్యం విలపిస్తోంది. చేతిలో చిల్లిగవ్వ లేదని, కుమారుడిని ఎలా బతికించుకోవాలంటూ ఆవేదన చెందుతోంది. వివరాల్లోకి వెళ్తే.. రాయికల్ పట్టణంలోని ఓరుగంటి సత్తమ్మ బీడీలు చుడుతోంది. తన కొడుకు సాగర్‌కు రెండు కిడ్నీలు పాడవడంతో మొదటగా వరంగల్‌లో డయాలసిస్ చేయించింది. అప్పటికే రూ.2 లక్షల వరకు అప్పు ఉండటంతో.. అప్పు తీర్చడం, కొడుకును బతికించుకోవడం ఎలా అని ఆలోచించింది. సాగర్‌ను జగిత్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి రోజు విడిచి రోజు తీసుకెళ్తూ డయాలసిస్ చేయిస్తోంది. ప్రయాణానికి, మందులకు నెలకు రూ.6 వేలు ఖర్చవుతోందని, తాను బీడీలు చుట్టగా వచ్చే డబ్బులు ఏమాత్రం సరిపోవడం లేదని సత్తమ్మ కన్నీరుమున్నీరవుతోంది. సాగర్ చేయి సరిగా పని చేయకపోవడంతో ఏ పని చేయాలన్నా ఇబ్బంది పడుతున్నారు. అతనికి పింఛన్ కూడా రావడం లేదు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి స్పందించి, తనకు పింఛన్ మంజూరు చేయాలని కోరుతున్నాడు. దాతలు స్పందించి, తన కుమారుడి వైద్యానికి ఆర్థికసాయం చేసి, ప్రాణభిక్ష పెట్టాలని సత్తమ్మ వేడుకుంటోంది. సాయం చేయాలనుకునే వారు తన ఫోన్ నంబర్ 63036 40759కు ఫోన్‌పే లేదా గూగుల్‌పే చేయాలని సాగర్ కోరుతున్నాడు.

వైద్యం చేయించు'కొన'లేని పేదరికం

- ఆపన్నహస్తం అందించాలని వేడుకోలు


ఆస్పత్రిలో సతీశ్

సిరిసిల్లటౌన్: కొడుకు ఎదిగాడన్న ఆశలు ఆ తల్లిదండ్రులకు ఎంతో కాలం నిలువలేదు. విధి ఆడిన నాటకంలో నవ్వుతూ.. తిరుగుతూ..సంపాదిస్తున్న యువకుడు అచేతన స్థితిలోకి వెళ్లాడు. పెద్దాపరేషన్ చేయించు'కొన'లేని స్థితిలో ఉంటున్న యువకుడి దైన్య పరిస్థితి ఇది. సిరిసిల్ల పట్టణానికి చెందిన కొత్వాల సతీశ్ సెలూన్‌లో పనిచేస్తూ తల్లి దండ్రులకు చేదోడువాదోడుగా ఉంటున్నాడు. ఇటీవల తీవ్ర కడుపునొప్పితో బాధపడుతుండగా ఆస్పత్రికి తీసుకెళ్లగా పెద్దపేగు తీసేయాలని వైద్యులు తెలిపారు. ఇందుకు రూ.10లక్షలు ఖర్చవుతాయని హైదరాబాద్‌లో చికిత్స అందిస్తున్న వైద్యులు తెలిపారు. రెక్కాడితే గాని డొక్కాడని తల్లిదండ్రులు కొడుకును బతికించుకునేందుకు సాయం కోసం చేతులు చాపుతున్నారు. ఆపన్నహస్తం అందించాలని వేడుకుంటున్నారు. 96409 28269లో ఫోన్‌పే ద్వారా ఆర్థికసాయం అందించాలని కోరుతున్నారు.

మంచంపట్టిన మహిళ


షేక్ జులేఖ

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రాచర్లబొప్పాపూర్‌కు చెందిన బీఆర్‌ఎస్ మహిళా గ్రామాధ్యక్షురాలు షేక్ జులేఖ అనారోగ్యంతో బాధపడుతోంది. తలలో రక్తం గడ్డ కట్టడంతో ఇబ్బందులు పడుతోంది. జులేఖ భర్త సత్తార్ గతంలోనే ఆమెను విడిచిపెట్టాడు. జులేఖకు ఇద్దరు సంతానం షేక్ ఇమ్రాన్, షేక్ తబస్సుం. అప్పులు చేసి కూతురు తబస్సుం పెళ్లి చేయగా, కొడు కు ఇమ్రాన్ రెండు సార్లు గల్ఫ్ వెళ్లి మోసపోయాడు. ఇలా రూ.12లక్షల వరకు అప్పులపాలయ్యారు. జులేఖకు తలలో రక్తం గడ్డ కట్టడంతో కాళ్లు చేతులు పనిచేయడం లేదు. చికిత్సకు రూ.50వేల వరకు ఖర్చు చేశారు. ఆరోగ్యం బాగుచేసుకునేందుకు డబ్బు ల్లేక ఇంటి వద్దే ఉంటుంది. దాతలు ఫోన్‌పే, గూగుల్ పే 95058 41287లో సాయం చేయాలని వేడుకుంటుంది.

కష్టపడి పెంచిన బిడ్డా.. ఇడిసిపోతివా?

- చికిత్స పొందుతూ బాలిక మృతి
- ఆస్తి విషయంలో గొడవలతో మనస్తాపానికి గురై, ఆత్మహత్యాయత్నం
- బండపల్లిలో విషాదం


శ్రీవాణి (ఫైల్)


మృతదేహంపై పడి రోదిస్తున్న తల్లి

చందుర్తి(వేములవాడ): ఆస్తి గొడవలతో మనస్తాపానికి గురైన ఓ బాలిక ఆత్మహత్యాయత్నం చేయగా.. చికిత్స పొందుతూ మృతిచెందింది. ఒక్కగానొక్క బిడ్డవని రెక్కల కష్టం చేసి, పెంచి పెద్ద చేసుకుంటిని బిడ్డా.. నన్ను ఇడిసిపెట్టి ఎలా పోవాలనిపించింది బిడ్డా.. ఎవరిని చూసుకొని బతకాలె బిడ్డా అంటూ ఆమె తల్లి రోదించిన తీరు అక్కడున్నవారిని కంటతడి పెట్టించింది. పోలీసుల కథనం ప్రకారం.. చందుర్తి మండలం బండపల్లికి చెందిన కుమ్మరి లచ్చయ్యకు భార్య లలిత, కుమారుడు బాబు ఉన్నారు. లలిత తల్లిగారింటికి వెళ్లిపోయి, కాపురానికి రాలేదు. తర్వాత లచ్చయ్య లచ్చవ్వను రెండో పెళ్లి చేసుకున్నాడు. ఈ దంపతులకు ఒక కూతురు శ్రీవాణి(14) జన్మించింది. ఆమె తొమ్మిదోతరగతి చదువుతోంది. లచ్చయ్య రెండేళ్ల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. అప్పటివరకు ఎలాంటి బాధ లేని ఆ కుటుంబంలో లచ్చయ్య మరణంతో ఆస్తి వివాదాలు మొదలయ్యాయి. ఇంటితోపాటు రెండెకరాల భూమిలో తమకు వాటా ఉందని అతని మొదటి భార్య కొడుకు బాబు పలుమార్లు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాడు. అ ప్పటినుంచి గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఆ ఇంటి వెనక స్థలంలో గుడిసె వేసుకోవాలని బాబు చూడగా లచ్చవ్వ అడ్డు చెప్పింది. ఆస్తిలో తనకు హక్కు ఉందని అతను.. తమకు వీలునామా రాశాడని ఆమె గొ డవ పడుతున్నారు. దీంతో శ్రీవాణి మనస్తాపానికి గురైంది. ఈ నెల 1న ఇంట్లోనే దూలానికి ఉరి పెట్టుకుంది. గమనించిన తల్లి కేకలు వేయడంతో చుట్టుపక్కలవారు వచ్చి, ఆమెను కిందికి దించారు. అపస్మారక స్థితిలోకి చేరిన శ్రీవాణిని ఆటోలో వేములవాడ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పడంతో కరీంనగర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం చనిపోయింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు బాబుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. కాగా, శ్రీవాణి మృతదేహానికి పోస్టుమార్టం చేయించి, రాత్రి స్వగ్రామం తరలించారు.

మర్రిగడ్డవాసిపై పోక్సో కేసు

చందుర్తి(వేములవాడ): మండలంలోని మర్రిగడ్డ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి(38)పై బుధవారం పోక్సో కేసు నమోదు చేసినట్లు చందుర్తి ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఆ వ్యక్తి మర్రిగడ్డకే చెందిన బాలిక స్నానం చేస్తుండగా వెళ్లి, లైంగిక దాడికి యత్నించాడు. కుటుంబసభ్యులు అడ్డుకొని, వెంటనే 100కు కాల్ చేశారు. పోలీసులు అక్కడికి చేరుకొని, అతన్ని అదుపులోకి తీసుకున్నారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆరుగురు ఖైదీల విడుదల

- తొలుత కరీంనగర్ జైలు నుంచి చర్లపల్లికి తరలింపు
- అక్కడి నుంచి రిలీజ్
- వీరిలో పలువురికి ఉద్యోగాలివ్వాలని నిర్ణయించిన ప్రభుత్వం!
- ఉమ్మడి జిల్లాకు సంబంధించి ముగ్గురికి అవకాశం?
- ఖైదీల కుటుంబాల్లో ఆనందం


కరీంనగర్ జిల్లా జైలు

కరీంనగర్ క్రైం: రాష్ట్ర ప్రభుత్వం సత్ప్రవర్తన కలిగిన 213 మంది ఖైదీలను క్షమాభిక్షపై విడుదల చేయాలని నిర్ణయించడంతో కరీంనగర్ జిల్లా జైలు నుంచి ఆరుగురు విడుదలయ్యారు. ఇక్కడి నుంచి మొత్తం ఏడుగురి విడుదలకు ప్రతిపాదనలు పంపించగా ఒకరి పేరు తిరస్కరణకు గురైంది. కరీంనగర్ నుంచి విడుదల జాబితాలో ఉన్న ఖైదీలను ముందే చర్లపల్లికి తరలించగా అక్కడ నుంచి బుధవారం మధ్యాహ్నం విడుదలయ్యారు. వీరందరికీ 2010 లో వివిధ హత్య కేసుల్లో జీవితఖైదు విధించగా పదమూడున్నరేళ్లకు పైగా శిక్ష అనుభవించారు.

విడుదలైంది వీరే..

రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన తండ్రీకొడుకులు ముచ్చె గంగయ్య, మధు, ఆశయ్య, గోదావరిఖనికి చెందిన ముస్తాక్ అహ్మద్, జగిత్యాల జిల్లా రాయికల్‌కు చెందిన సయ్యద్ జుబేర్, కరీంనగర్ పట్టణానికి చెందిన పవర్ రాజు జైలు నుంచి విడుదలయ్యారు. దీంతో వారి కుటుంబసభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అయితే, రాష్ట్రవ్యాప్తంగా విడుదలైన ఖైదీల్లో మహిళలైతే కుట్టు మెషిన్లు అందించి ఉపాధి కల్పించడం, పురుషులైతే జైళ్ల అనుబంధ సంస్థలు, పెట్రోల్ బంకుల్లో ఉద్యోగాలివ్వాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. కరీంనగర్ జైలు నుంచి విడుదలైనవారిలో ముగ్గురికి ఉద్యోగాలు ఇవ్వనున్నట్లు సమాచారం. సత్ప్రవర్తనతో విడుదలైన వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

ముగ్గురం విడుదలయ్యాం



నేను, నా ఇద్దరు కొడుకులు 13 ఏళ్లకు పైగా కరీంనగర్ జైలులో శిక్ష అనుభవిస్తున్నాం. ప్రభుత్వం సత్ప్రవర్తన కలిగిన ఖైదీలను క్షమాభిక్ష పెట్టడం ద్వారా మేము ముగ్గురం ఒకేసారి విడుదలవడం సంతోషంగా ఉంది. ప్రభుత్వానికి ధన్యవాదాలు.

– ముచ్చె గంగయ్య, గంభీరావుపేట

మంచిగా పని చేసుకుంట



ప్రభుత్వం నాకు క్షమాభిక్ష పెట్టి, విడుదల చేయడంతో చాలా ఆనందంగా ఉంది. ఇక నుంచి ఏ తప్పూ చేయను. మంచిగా పని చేసుకుంట. నా కొడుకు, బిడ్డలను సాదుకుంట. జైలు అధికారులు, ప్రభుత్వ అధికారులకు కృతజ్ఞతలు.

– పవర్ రాజు, కరీంనగర్

సంతోషంగా ఉంది

నా భర్త, ఇద్దరు కొడుకులు జైలు నుంచి విడుదలవడం సంతోషంగా ఉంది. మాపై దయచూపిన ప్రభుత్వానికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు చెప్తున్న. ఇన్ని రోజులు జైల్లో ఉండి, విడుదలైన ఖైదీల కుటుంబసభ్యులందరూ సంతోషంగా ఉన్నారు.

– ముచ్చె రాజవ్వ, గంభీరావుపేట

గ్రూప్–2 గ్రాండ్ టెస్టులకు దరఖాస్తు చేసుకోండి

కరీంనగర్: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే గ్రూప్–2 పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు కరీంనగర్ బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో గ్రాండ్ టెస్టులు నిర్వహిస్తున్నట్లు స్టడీ సర్కిల్ డైరెక్టర్ రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల అభ్యర్థులు www.tsbcstudycircle.cgg.gov.in వెబ్‌సైట్‌లో ఈ నెల 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. పరీక్షలు కరీంనగర్ బీసీ స్టడీ సర్కిల్‌లో ఈ నెల 8, 9, 15, 16, 22, 23, 30, 31వ తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు అలాగే, మధ్యాహ్నం 1.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 0878–2268686 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఫేక్ యాప్‌తో రూ.5 లక్షలు స్వాహా

కథలాపూర్(వేములవాడ): ఫేక్ యాప్ ద్వారా సైబర్ నేరగాడు ఓ వ్యక్తి నుంచి రూ.5 లక్షలు స్వాహా చేశాడు. ఎస్సై నవీన్‌కుమార్ వివరాల ప్రకారం.. కథలాపూర్ మండలంలోని గంభీర్‌పూర్‌కు చెందిన వ్యక్తి భవన నిర్మాణానికి సిమెంట్ కోసం పలు యాప్‌ల వివరాలు సేకరించాడు. ఈ క్రమంలో ఓ సిమెంట్ కంపెనీ పేరిట ఉన్న నకిలీ లింక్‌ను క్లిక్ చేయడంతో డబ్బులు చెల్లించాలని సమాచారం వచ్చింది. వారం క్రితం మొదటగా రూ.100 పంపడంతో సైబర్ నేరగాడు ఆ వ్యక్తికి నమ్మకం కలిగేలా వ్యవహరించాడు. దీంతో రూ.లక్ష, తర్వాత రూ.2 లక్షలు పంపించాడు. లారీ లోడ్ సిమెంట్ బస్తాలు కావాలంటే రూ.5 లక్షలు పూర్తిగా చెల్లించాలని సమాచారం రావడంతో చివరగా రూ.2 లక్షలు పంపాడు. అయినా, సిమెంట్ బస్తాలు రాకపోవడంతో మోసపోయాయని గ్రహించాడు. బుధవారం కథలాపూర్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బస్టాండ్‌లో చోరీకి యత్నించిన వ్యక్తి పట్టివేత

కరీంనగర్ క్రైం: కరీంనగర్ బస్టాండ్‌లో చోరీకి యత్నించిన ఓ వ్యక్తిని పట్టుకున్నట్లు ఆర్టీసీ పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. నగరంలోని ఆదర్శనగర్‌కు చెందిన చిలుక రాజు బస్టాండ్‌లో గతంలో దొంగతనాలకు పాల్పడ్డాడు. బుధవారం చోరీ చేసేందుకు ఓ ప్రయాణికుడి జేబులో చేయి పెడుతుండగా పట్టుకొని, వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. ఆర్టీసీ పోలీసు సిబ్బంది కృష్ణ, ఐసీఎస్. రావు, లక్ష్మతి, రమణ, మానస ఉన్నారు.

'అల్ఫోర్స్'లో రెయిన్‌బో ఉత్సవాలు


వేడుకల్లో విద్యార్థులతో చైర్మన్ నరేందర్ రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): కరీంనగర్ వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ నెక్స్ట్‌లో బుధవారం నిర్వహించిన అల్ఫోర్స్ రెయిన్‌బో ఉత్సవాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల విద్య ప్రణాళికలో భాగంగా సప్తవర్ణంతో కూడిన రెయిన్‌బోను విద్యార్థులు ప్లకార్డులపై ప్రదర్శించారు. చిన్నారులు ప్రదర్శించిన రెయిన్‌బో ఈజ్ మై బెస్ట్ ఫ్రెండ్, ఓ రెయన్ ఓహో రెయన్ నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి మాట్లాడారు. విద్యార్థులకు సృజనాత్మకతతో కూడిన విద్యనందించేందుకు పాఠశాలలో వివిధ పద్ధతులు అమలు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం చక్కని ప్రదర్శనలిచ్చిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎన్నికలపై అవగాహన పెంచుకోవాలి


రామడుగు: ఓటు వేస్తున్న విద్యార్థులు

రామడుగు(చొప్పదండి): ప్రతీ విద్యార్థి ప్రాథమిక విద్య స్థాయి నుంచే ఎన్నికలపై అవగాహన పెంచుకోవాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి అన్నారు. రామడుగు మండలంలోని గోపాల్‌రావుపేట అల్ఫోర్స్ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు మాక్ పోలింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాక్ పోలింగ్ వల్ల విద్యార్థులకు ఓటింగ్‌పై అవగాహన, భవిష్యత్తులో ఓటువేసే విధానం తెలుస్తాయని పేర్కొన్నారు. తేజస్, సరస్, ధ్రువ, లక్ష్య విభాగాలకు చెందిన బాలబాలికలకు వేర్వేరుగా ఈ కార్యక్రమం చేపట్టారు.

వృద్ధ దంపతులపై కుక్క దాడి

- ఇద్దరికీ తీవ్ర గాయాలు


చికిత్స పొందుతున్న కనకమ్మ

జమ్మికుంట(హుజూరాబాద్): కుక్క దాడిలో వృద్ధ దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తుల వివరాల ప్రకారం.. జమ్మికుంట మండలంలోని నాగారం గ్రామానికి చెందిన రామ్ కనకమ్మ, బోషయ్య దంపతులు. కనకమ్మ అనారోగ్యం కారణంగా కొంతకాలంగా మంచానికే పరిమితమైంది. దంపతులు మంగళవారం రాత్రి తమ ఇంటి ఎదుట నిద్రించారు. బుధవారం తెల్లవారుజామున కుక్క వచ్చి, వారిపై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డారు. లేవలేని స్థితిలో ఉన్న బాధితులను ఉదయం చూసిన చుట్టుపక్కలవారు 108కు సమాచారం అందించారు. సిబ్బంది వచ్చి, హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తీసుకెళ్లారు. కనకమ్మ పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. నాగారంలో కుక్కల బెడద ఎక్కువైందని, అధికారులు స్పందించి, వాటిని దూరంగా తరలించాలని గ్రామస్తులు కోరుతున్నారు.